నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, గురువారం 20 ఫిబ్రవరి 2025 MEDAK

## పశువులకు మేతగా మక్కపంట


ముబారాస్‌పూర్‌లో పశువులు మేపుతున్న రైతు

రాయపోల్, ఫిబ్రవరి 19: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో యాసంగి పంటలు ఎండిపోతున్నాయి. కరెంట్ కష్టాలతోపాటు భూగర్భ జలాలు అడుగంటడంతో వరి, మక్క పంటలు దెబ్బతింటున్నాయి. బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటడంతో పొలాలు బీటలు వారుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో కరెంట్, సాగునీటి కష్టాలు తలెత్తలేదని, కాల్వల ద్వారా కేసీఆర్ నీరందించడంతో ధీమాగా పంటలు సాగుచేశామని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని దౌల్తాబాద్ మండలంలోని ముబారాస్‌పూర్ గ్రామానికి చెందిన రైతు భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు భిక్షపతి తన ఎకరా చేనులో మక్క పంట వేశాడు. కరెంట్ కష్టాలు, బోరు నుంచి నీరు రాకపోవడంతో పంట ఎండి పోతుండడంతో పశువులకు మేతగా వేశాడు.

# మెట్ట రైతులకు నీటిగోస

- అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండిపోతున్న పంటలు
- గౌరవెల్లి నీటితో భూములు తడిసేదెప్పుడు
- ఒకవైపు అప్పుల భారం... మరోవైపు దక్కని ఫలితం
- కన్నీరుపెడుతున్న హుస్నాబాద్ మెట్ట రైతులు


హుస్నాబాద్ శివారులో వరిచేలు ఎండిపోవడంతో మేస్తున్న పశువులు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 19: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతంలో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. తీవ్ర నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను తలపించే ఈ ప్రాంతంలో పంటలు సాగుచేయడం రైతులకు కత్తిమీద సాములా మారింది. అప్పులు చేసి పంటలు వేస్తే చేతికి వచ్చే వరకు గ్యారంటీ లేదు. జూదంలా సాగు మారిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగునీటి కష్టాలు తీర్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన గౌరవెల్లి రిజర్వాయర్ పనులు 90శాతం మేరకు పూర్తయ్యాయి. బీఆర్‌ఎస్ హయాంలో ట్రయల్‌రన్ సైతం పూర్తిచేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చాక ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది.

### నీళ్ల కోసం ఎదురుచూపులు

దుర్భిక్ష పరిస్థితులకు నిలయమైన హుస్నాబాద్ ప్రాంత రైతులు గౌరవెల్లి రిజర్వాయర్ నీటికోసం ఎదురుచూస్తున్నారు. తమ వ్యవసాయ భూములను తడిపేందుకు ఎప్పుడు నీళ్లు వస్తాయా అని ఆశపడుతున్నారు. నీటి సమస్యతో ఈ ప్రాంతంలో ఏటా పంటలు చేతికొచ్చే సమయంలో పోతుండటంతో పశువులకు మేతగా మారుతున్నాయి. దీంతో రైతులకు కష్టం బూడిద పాలవుతున్నది. అప్పులే మిగులుతున్నాయి. సిద్దిపేటలో జిల్లాలో మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో వ్యవసాయ బావులు, బోర్లు అడుగంటుతున్నాయి. యాసంగిలో వేసిన వరిపొలాలు పొట్టకు వచ్చి ఈనుతున్న క్రమంలో నీటి సమస్యలతో ఎండిపోతున్నాయి. హుస్నాబాద్ శివారులోని పలువురు రైతులకు చెందిన పొలాలు సాగునీరందక ఎండిపోతున్నాయి. వేలాదిరూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వస్తుందన్న ఆశతో ఉన్న రైతులకు ఈ యాసంగి కలిసి రావడం లేదు.

### పంట మొత్తం ఎండిపోతున్నది..



నాకు రెండున్నర ఎకరాల ఎవసాయ భూమి ఉంది. నీళ్లు ఎల్లుతయో లేదోనని రెండు ఎకరాల్లోనే వరివేసిన. దాదాపు నలభై వేలరూపాయల దాకా పెట్టుబడి అయ్యింది. పల్లెచెరువు కింద ఉన్న మా పొలాలకు ఎల్లమ్మచెరువు నీళ్లే వత్తయి అని నాటేసినం. కాల్వకూడా తీసింండ్రు. అండ్ల నీళ్లు వత్తే పల్లెచెరువు కింద బాయిలల్ల నీళ్లు ఎల్లుతయి మాకు. ఆ ఆశతోనే ఈ బాయిల నీళ్లు ఉబ్బుతయి అని వరిపెట్టిన. లేకపోతే సేను వెయ్యికపోతును. పైపు బిండలు తెచ్చిన మడిమడికి నీళ్లు వేసిన అందుతలేదు. పదిహేను వేల రూపాయలు పెట్టి బావిల పూడిక తీసిన. కానీ, ఏం పాయిదలేదు. సేను కోసుకునే టైంల ఎండిపోయింది. సేను సెయ్యబట్టి అప్పుల పాలై పోయిన. అడిన్న ఈడిన్న అప్పులు తెచ్చి పంట పెట్టిన. ఏదిసేసినా నోట్లకు వచ్చినంక పోయింది. ఇరవై గుంటల భూమి ఇడిసిపెట్టిన చేతికి వత్తలేదు.

– గొర్ల కొమురయ్య, రైతు, హుస్నాబాద్

### బాయిల పూడిక తీయిస్తున్న..



కౌలుకు తీసుకుని నాలుగు ఎకరాల్లో వరి పంట పెట్టిన. ఎండలు ముదరడంతో నీళ్లు ఎల్తుత లేవు. ఎట్ల అని బాయిల పూడిక తీద్దమని సెప్పిన. నలభైవేల రూపాయలు అడిగింండ్రు. ఐదు రోజుల నుంచి బాయిల పూడిక తీయిస్తున్న. మల్ల గంటసేపు నీళ్లు ఎల్తుతయని ఆశతోనే బాయిల పూడిక తీయిస్తున్న. ఇంక వారం రోజులు అయితట్టు ఉంది. మట్టి బాగా ఉందని సెప్పుతండ్రు. కానీ, నీళ్లు ఎల్లకపోతే వరి పొట్ట మీద ఉన్నది. గిప్పుడు నీళ్లు అందుతనే ఇంత నోట్లకు ఇన్ని గింజలు వచ్చేతట్టు ఉన్నయి.

– జక్కుల ఎల్లయ్య, రైతు, హుస్నాబాద్


హుస్నాబాద్ శివారులో బావిలో పూడిక తీస్తున్న కూలీలు


హుస్నాబాద్ శివారులో సాగునీరులేక ఎండిపోయిన వ్యవసాయ బావి

# ఆశావహుల నిరాశ..!



- పంచాయతీ, పరిషత్ ఎన్నికల నిర్వహణపై సందిగ్ధం
- 28 వరకు కొనసాగనున్న కులగణన రీసర్వే
- ఊరించి ఉసూరుమనిపించిన కాంగ్రెస్ సర్కార్
- ఇప్పట్లో స్థానిక ఎన్నికలు లేనట్టే

మెదక్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారం యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఫిబ్రవరి 15లోపు ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని అంతా భావించారు. కుల గణనలో పాల్గొనని వారి కోసం ఈనెల 16 నుంచి 28 వరకు రీసర్వే నిర్వహణకు ప్రభుత్వం ప్రకటించింది. చివరకు మరోసారి కుల గణన చేపట్టడంతో పాటు బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇక ఇప్పట్లో ఎన్నికలు జరగవని తేలిపోయింది. ఓవైపు కుల గణన, మరోవైపు మార్చిలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు, ఇలా సుమారు మూడు నెలలకు పైగా సమయం తీసుకునే అవకాశం ఉండడంతో ఎన్నికల వేడి తగ్గిపోయింది.

### ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

మెదక్ జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. 492 గ్రామ పంచాయతీలు, 21 జడ్పీటీసీ, 21 ఎంపీపీ స్థానాలతో పాటు మొత్తం 190 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,052 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. మెదక్ జిల్లాలో మొత్తం 5,23,966 మంది ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 2,71,878 మంది, పురుష ఓటర్లు 2,52,079 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. మార్చి రెండోవారం నాటికి పరిషత్, సర్పంచ్ ఎన్నికలు ముగించాలని ప్రభుత్వం మొదట భావించింది. అందుకు తగ్గట్టుగానే యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలైంది. ఇప్పటికే ఓటర్లు తుది జాబితాను ప్రదర్శించిన విషయం తెలిసిందే. బ్యాలెట్ బాక్సులు, నామినేషన్ పత్రాలు, బ్యాలెట్ పేపర్లు జిల్లాకు చేరాయి. ఎన్నికల అధికారులకు శిక్షణ సైతం ఇచ్చారు. ఇకపోతే రిజర్వేషన్లు ఖరారు చేయడమే మిగిలి ఉంది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎన్నికల బరిలో నిలువాలన్న ఆశావహుల్లోనూ నిరాశ నెలకొంది.

### వరుసగా పరీక్షలు...

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఆ తర్వాత 18 నుంచి పదో తరగతి పరీక్షలు, ఏప్రిల్‌లో ప్రైమరీ, సెకండరీ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు మొదలవుతాయి. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఉపాధ్యాయులు పరీక్షల నిర్వహణలో బిజీగా ఉంటారు. ఈ నెల 28 వరకు కుల గణన సర్వే పూర్తయిన తర్వాత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై ప్రకటన చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత అసెంబ్లీలో, గవర్నర్ చేత బిల్లు ఆమోదింపజేయాలి. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి సమయం పట్టే అవకాశం ఉంది. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదనే చర్చ జరుగుతున్నది. దీంతో ఆశావహులు నిరాశలో ఉన్నారు.

### రిజర్వేషన్ల కోసం ఎదురుచూపులు

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కుల గణన చేపట్టింది. గతంలో సర్వేలో పాల్గొనని వారి కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈనెల 16 నుంచి 28 వరకు సర్వే చేపడుతోంది. కుల గణన సర్వే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయనుండడంతో ఆశావహుల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో బరిలో ఉంటామని చెబుతూ ప్రజల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పల్లెల్లో జోరుగా విందులు ఏర్పాటు చేస్తూ ఖర్చు పెడుతున్నారు.


సిద్దిపేటలో మాట్లాడుతున్న ఫరూఖ్ హుస్సేన్, మిత్ర బృందం

## సిద్దిపేట అభివృద్ధి అద్భుతం

**ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, మిత్రులు**

సిద్దిపేట, ఫిబ్రవరి 19 : సిద్దిపేట అభివృద్ధిని చూసి ఆశ్చర్యానికి గురయ్యామని, నాడు కేసీఆర్ సిద్దిపేట అభివృద్ధికి బాటలు వేశారని, నేడు ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేటను దేశానికే తలమానికంగా మార్చారని మాజీఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ అన్నారు. ఫరూక్ హుస్సేన్‌తోపాటు చదువుకున్న పాఠశాల, కళాశాల మిత్రులతో బుధవారం సిద్దిపేటలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా రోజుల తర్వాత కలిసిన ఆప్తమిత్రులకు రంగనాయక సాగర్, సిద్దిపేట కోమటి చెరువు, మెడికల్ కళాశాల, మల్లన్న సాగర్ లాంటి అభివృద్ధి పనులను ఆయన చూపించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మిత్రులతో కలిసి ఫరూక్ హుస్సేన్ మాట్లాడారు.1985లో కేసీఆర్ అభివృద్ధికి నాంది పలికితే, హరీశ్‌రావు అభివృద్ధి కొనసాగిస్తూ తెలంగాణకు తలమానికంగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా ఫరూక్‌హుస్సేన్ మిత్రుడు హబీబ్ మాట్లాడుతూ.. 40 ఏండ్ల కింద తాము సిద్దిపేట వదిలి వెళ్లామని, ఫరూక్ హుస్సేన్ వల్ల తిరిగి సిద్దిపేటలో కలుసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిని చూసి ఆశ్చర్యానికి గురైనట్లు తెలిపారు. గతంలో సిద్దిపేట ప్రాంతంలో నీటి కటకట ఉండేదని, ఇప్పుడు అద్భుతమైన నీటి వసతి కల్పించారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నీరు అందించడం గొప్ప విషయమన్నారు. ఎటు చూసినా చక్కటి రోడ్లు, ప్రకృతి వనాలు, మెడికల్, ఎడ్యుకేషన్ హబ్‌లు కనిపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేఖ్ అహ్మద్ అయాజ్, సికిందర్, జహీర్ ఇక్బాల్, తాబరిక్ అలీ, జబీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనడానికి వచ్చి రిజస్టర్‌లో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## మలబార్ గోల్డ్ సేవలు అభినందనీయం

**జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్**


ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో జడ్జి రమేశ్, ఆర్జేడీ రాజేందర్ సింగ్, ప్రిన్సిపాల్ తదితరులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 19: మహిళా అభివృద్ధికి మలబార్ గోల్డ్ అందిస్తున్న సేవలు అభినందనీయ సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థినులకు మలబార్ గోల్డ్ సహకారంతో ఉపకార వేతనాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి మాట్లాడు తూ..పేద విద్యార్థులకు రూ.8 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందించడంతో పాటు సమాజ సేవలో భాగంగా ప్రతి రోజు అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సేవలను బాలురకు విస్తరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఆర్జేడీ రాజేందర్ సింగ్ మాట్లాడుతూ.. బాలికల విద్యాభివృద్ధిలో మలబార్ గోల్డ్ సేవలను అభినందించారు. మహిళలు అన్ని రం గాల్లో రాణించడం దేశానికి శుభపరిణామం అని పేర్కొన్నారు. అనంతరం 192 మంది బాలికలకు ఒక్కొక్కరికీ రూ.8వేల ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, మలబార్ గోల్డ్ చందానగర్ శాఖ అధికారి దీపక్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఖాసీం బేగ్, జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి బీవీఆర్‌ఐటీలో బాహ సే ఇండియా


వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ సంజయ్

నర్సాపూర్, ఫిబ్రవరి19 :మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో గురువారం(నేటి) నుంచి 23వ తేదీ వరకు 'బాహ సే ఇండియా-2025' నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దూబే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆటోమోటీవ్, ఎయిర్‌స్పేస్, వాణిజ్య వాహన పరిశ్రమలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఇంజినీర్ల సంఘం సొసైటీ ఆఫ్ ఆటోమోటీవ్ ఇంజినీర్స్(ఎస్‌ఏఈ), శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ఎస్‌ఏఈ బాహ సే ఇండియాతో కలిసి ప్రతిష్టాత్మక అంతర్ కళాశాలల బాహ సే ఇండియా-2025 నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇది ఒక ఆల్ టెర్రేన్ వాహన(ఏటీవీ) రేసింగ్ ఛాలెంజ్ అని తెలిపారు. యువ మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీర్ల జ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యాలను కఠినంగా పరీక్షిస్తుందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీ, ఎన్‌ఐటీ ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి 82 జట్లతో 2500పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ ఈవెంట్ అంతర్జాతీయ ఆటోమోటీవ్ రంగంలో వేగంగా మారుతున్న దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి, సృజనాత్మకత, టీమ్‌వర్క్‌ను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ ఈవెంట్‌లో గ్లోబల్ ఆటోమోటీవ్ దిగ్గజాలు వోల్వో, డైమ్లర్, ఏవీఎల్, అల్టెర్, టాటా మోటర్స్, మహీంద్రా తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. యువ ఇంజినీర్లకు తమ కెరీర్‌ను ప్రారంభించడానికి ఈ వేదిక అత్యుత్తమ అవకాశంగా ఉంటుందని సంజయ్ దూబే పేర్కొన్నారు.

## నీటిని విడుదల చేయాలని రైతుల ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు

నారాయణరావుపేట, ఫిబ్రవరి 19: రంగనాయకసాగర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువ నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ బుధవారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలంలోని మల్యాల, బంజేరుపల్లి గ్రామాల రైతులు రాఘవాపూర్ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రంగనాయకసాగర్ ప్రాజెక్టు ద్వారా కొన్ని రోజుల నుంచి నీటిని విడుదల చేశారని, ప్రస్తుతం కాలువల్లో నీటి ప్రవాహం తగ్గి సరిపడా సాగునీరు అందడం లేదన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మండుటెండల్లో సైతం సాగునీరు అందించి ఇబ్బందులు లేకుండా చూశారని రైతులు పేర్కొన్నారు. సరిపడా నీటిని అందించి పంటలను కాపాడాలని కోరారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీరందిస్తామని హామీ ఇచ్చారు.



గుమ్మడిదలలో జాతీయ రహదారిపై ర్యాలీ తీస్తున్న మహిళలు


గుమ్మడిదలలో 15వ రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్న గౌడసంఘం నాయకులు

# డంపుయార్డు పనులు ఆపాలి

- గుమ్మిడిదలలో కొనసాగిన ఆందోళనలు
- జాతీయ రహదారిపై భారీ ర్యాలీ
- మోకాళ్లపై నిలుచుని అర్ధనగ్న ప్రదర్శన
- గౌడసంఘం ఆధ్వర్యంలో గుమ్మడిదలలో దీక్షలు
- నర్సాపూర్‌లో రాస్తారోకో చేసిన నల్లవల్లి, కొత్తపల్లి గ్రామస్తులు


నల్లవల్లి, కొత్తపల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల,ఫిబ్రవరి19: సంగారెడ్డి జిల్లా నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. గుమ్మడిదలలో రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, మహిళా జేఏసీ అధ్యక్షురాలు మల్లమ్మ ఆధ్వర్యంలో బుధవారం జాతీయరహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌హెచ్‌పై రైతు జేఏసీ నాయకులు మోకాళ్లపై నిలుచుని అర్ధనగ్న ప్రదర్శన చేశారు. గౌడసంఘం అధ్యక్షుడు అర్జున్‌గౌడ్, రాములు గౌడ్, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గుమ్మిడిదలలో 15వ రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. డంపింగ్‌యార్డు రద్దుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులేనిదే రాజ్యం లేదు.. అంటూ నినాదాలు చేశారు. 15 రోజులు ఆందోళనలు చేస్తుంటే అధికార కాంగ్రెస్ నాయకులు ఎందుకు స్పందించడం లేదని మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మొండిగా వ్యవహరిస్తూ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయిస్తున్నారని, దీంతో తమ గ్రామాలకు ముప్పు తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు ఏర్పాటుతో నర్సాపూర్ రాయచెరువు, వన్యప్రాణులకు ముప్పు ఉందన్నారు. గాలి, నీరు,పర్యావరణ కాలుష్యంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా జేఏసీ అధ్యక్షురాలు మల్లమ్మ మాట్లాడుతూ.. మహిళలు సైతం రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నా సర్కారు మొద్దునిద్ర వీడడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారుకు రైతులు, మహిళల శాపం తగులుతుందని విమర్శించారు. అనంతరం రిలే నిరాహార దీక్ష కొనసాగడానికి గౌడసంఘం రూ. 10 వేలు రైతు జేఏసీకి విరాళం అందజేసింది. ఆందోళనలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మందభాస్కర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, పలుగు గోవర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, రాఘవరెడ్డి, రాంరెడ్డి, కరుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, మంగయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు ఐలయ్య, పద్మారెడ్డి,తుడుం శ్రీనివాస్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

### 15వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ఫ్యారానగర్ డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల ప్రజలు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. బుధవారం ఈ గ్రామస్తులు ట్రాక్టర్లలో జాతీయరహదారి-765డీ మీదుగా నర్సాపూర్ చేరుకుని హైవేపై భారీ రాస్తారోకో, ధర్నా చేశారు. గంటపాటు ఆందోళనలు చేపట్టడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. త్వరలో ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఆందోళనలో కుమ్మరి ఆంజనేయులు, రామకృష్ణ, శ్రీనివాస్, ఫయాజ్ షరీఫ్, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, సురేశ్, రాజుగౌడ్, రాము, ఆంజనేయులు, రవి, మహేందర్, కొరివి సురేశ్, మాజీ సర్పంచ్ రవి, మహేశ్, పోచయ్య, సత్తయ్య, శివకుమార్ అనిల్, శాంతమ్మ, లక్ష్మి, భారతమ్మ, స్వరూప పాల్గొన్నారు.


గుమ్మడిదలలో జాతీయ రహదారిపై మోకాళ్లపై నిల్చుని అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఆందోళనకారులు